

ఉత్తమ సేవలకు గుర్తింపు 8లో▸
ఉపాధ్యాయుల శ్రమకు తగిన ఫలితం దక్కింది. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దడంలో వారు చేసిన కృషిని ప్రభుత్వం గుర్తించింది.



జననేతకు ఘననివాళి
దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా శనివారం జరుపుకొన్నారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /24.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

ట్రెయినీ ఐఏఎస్‌లకు వీడ్కోలు



సమావేశానికి హాజరైన ట్రెయినీ ఐఏఎస్‌లు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ఇటీవల పర్యటించిన ట్రెయినీ ఐఏఎస్‌లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినీ ఐఏఎస్‌లు తాము పర్యటించిన ప్రాంతాల్లోని అనుభవాలను కలెక్టర్‌కు వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం కలెక్టర్ కేంద్ర, రాష్ట్ర పథకాల గురించి ట్రెయినీ ఐఏఎస్‌లకు వివరించారు.

'పోయిన మొబైల్‌ఫోన్లు పొందొచ్చు'



బాధితులకు సెల్‌ఫోన్లు ఇస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు తిరిగి పొందొచ్చని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 10మంది సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు వెంటనే అదే నంబర్‌తో కొత్త సిమ్ తీసుకోవాలని తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో లాగిన్ చేసి ఫోన్ ఐఎంఈఐ నంబర్ అప్‌లోడ్ చేసి 'రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్' అని నమోదు చేయాలని సూచించారు. తర్వాత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లు గుర్తించి బాధితులకు అందించేందుకు కృషి చేసిన ఐటీ కోర్ సిబ్బందిని అభినందించారు. ఏఎస్పీ వీరన్న, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, వివిధ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌సీడీసీని పరిశీలించిన పీవో



ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని జామ్, ఆలూరు, ధని, గోపాల్‌పేట్, సారంగాపూర్ గ్రామాల్లో చేపట్టిన ఎల్‌సీడీసీ కార్యక్రమాన్ని ఎయిడ్స్, లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీపీఎంవో రాజేశ్వర్ శనివారం పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి స్పర్శలేని, తెల్ల మచ్చలున్న వారిని గుర్తించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత చికిత్స అందుబాటులో ఉందనే విషయాన్ని బాధితులకు తెలుపాలని సూచించారు. స్థానిక వైద్యాధికారి సుభాష్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

సెంట్రల్ లైబ్రరీ ప్రారంభం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన న్యాయస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైబ్రరీని శనివారం హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అంతకుముందు ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ నందకు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

భైంసా డిపోకు భారీ గి'రాఖీ'

భైంసాటౌన్: ఆర్టీసీ భైంసా డిపోకు రాఖీ పండుగ అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. డిపో ఏర్పాటైన నుంచి ఇదే అత్యధిక ఆదాయమని డీఎం అమృత తెలిపారు. శనివారం డిపోలో ఉద్యోగులకు స్వీట్లు పంచారు. రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం రూ.15,59,456 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. అలాగే, ఓఆర్ 77 వచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులను ఎండీ సజ్జనార్, చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్‌ఎం సాలోమాన్ రాజ్ అభినందించినట్లు తెలిపారు.

నిత్యాన్నదాన సత్రానికి విరాళం



విరాళం ఇస్తున్న దయానంద్‌రెడ్డి

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి నిత్యాన్నదాన సత్రానికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు దయానంద్‌రెడ్డి రూ.లక్షా 16వేల చెక్కును విరాళంగా అందించారు. శనివారం ఆయన బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దయానంద్‌రెడ్డికి ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందించారు.

స్మార్ట్ సర్వే..!



- ఎమ్మెల్యేగా ఎవరైతే బాగుంటారని ఓటర్లకు ఫోన్‌కాల్ చేసి ఆరా
- వ్యక్తిగతంగా వివిధ పార్టీలు కూడా..
- 'థర్డ్ పార్టీ' సర్వేలూ ముమ్మరం
- క్షేత్రస్థాయి పరిస్థితిపై అంచనాలు

నిర్మల్: 'హలో.. మన నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎవరైతే బాగుంటారు.. ఇంద్రకరణ్‌రెడ్డి అయితే ఒకటి నొక్కండి.. మహేశ్వర్‌రెడ్డి అయితే రెండు నొక్కండి.. శ్రీహరిరావు అయితే మూడు నొక్కండి.. వీరెవరూ కాదంటే.. నాలుగు నొక్కండి..' అంటూ ఈ మధ్య జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఓటర్ల ఫోన్లు మోగుతున్నాయి. ఒక ఫోన్‌లో రెండు సిమ్‌లు ఉంటే, వెంటవెంటనే ఈ కాల్స్ వస్తున్నాయి. అంటే నియోజకవర్గ పరిధిలోని ఏ ఫోన్‌నంబర్‌నూ విడిచిపెట్టడం లేదు. తమ పార్టీ బలంతో పాటు అభ్యర్థికి ఉన్న ప్రజాదరణను తెలుసుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఈరకంగా 'స్మార్ట్' సర్వేలు చేయిస్తున్నాయి. మరోవైపు పలు సర్వే సంస్థలూ జిల్లాలో క్షేత్రస్థాయిలో పార్టీలు, అభ్యర్థులు, ఆశావహుల తీరుపై ఆరాతీస్తున్నాయి.

సోషల్ మీడియాను వాడుకుంటూ..

ఇప్పుడు చేతిలో ఫోన్‌లేని వారంటూ లేరు. ప్రతీఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటోంది. ఇప్పుడు మనిషి దగ్గరిదాకా వెళ్లనవసరం లేదు. సదరు వ్యక్తికి ఫోన్‌చేస్తే అన్నీ మాట్లాడుకోవచ్చు. దీన్నే పార్టీలు, సర్వేసంస్థలు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నాయి. జిల్లా పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో సర్వీస్ ప్రొవైడర్‌ల అనుసంధానంతో పొలిటికల్ కాల్స్ చేస్తున్నారు. ప్రధానంగా పోటీలో ఉండే వాళ్ల పేర్లు లేదా పార్టీ పేరు చెబుతూ తర్వాత చెప్పే సంఖ్యను నొక్కితే, సదరు అభ్యర్థి లేదా పార్టీపై ఆసక్తి చూపుతున్నట్లు అంచనా వేస్తున్నారు. కొన్ని పార్టీలు, అభ్యర్థులు, ఆశావహులు కాల్స్ చేయించడంతో పాటు సోషల్‌మీడియానూ వాడుకుంటున్నారు. సామాజిక మాధ్యమ వేదికగా తమకున్న ఆదరణ స్థాయిని నిర్ధారించుకుంటున్నారు.

'థర్డ్ పార్టీ' ద్వారా..

ఎన్నికల వేళ ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో.. తెలియని పరిస్థితి ప్రతీ పార్టీలోనూ ఉంటుంది. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను అడిగితే అన్నీ అనుకూలంగానే చెబుతారు. అసలు విషయాలనూ దాచిపెడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలోనే రాజకీయ పార్టీలు థర్డ్‌పార్టీలను రంగంలోకి దింపుతుంటాయి. జిల్లాలోనూ ఇలాంటి థర్డ్‌పార్టీ సంస్థలు సర్వే చేస్తున్నాయి. దాదాపు ఆర్నెళ్ల ముందునుంచే ఇవే రంగంలోకి దిగాయి. ఎన్నికలకు ఇంకా మూడు నెలలే ఉండటంతో ఎప్పటికప్పుడు మారుతున్న ఓటర్‌నాడీని పసిగడుతూ తమకు పని అప్పగించిన పార్టీలకు సమాచారం చేరవేస్తున్నాయి. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో ఇంటెలిజెన్స్ వ్యవస్థతో పాటు ఇలాంటి థర్డ్‌పార్టీ సర్వే సంస్థల రిపోర్టులూ కీలకంగా పనిచేశాయి. కాంగ్రెస్ ఇప్పటికీ ఒకట్రెండు సంస్థలతో ఆరా తీయిస్తోంది. బీజేపీ ఐదోవిడత ప్రజాసంగ్రామయాత్ర సమయం నుంచే పలు సంస్థల ద్వారా ఎప్పటికప్పుడు సర్వేలు చేయిస్తూ వస్తోంది. ఇందులో కొన్ని హైదరాబాద్ కేంద్రంగా ఉంటూ రికార్డెడ్ ఫోన్ కాల్స్ ద్వారా ఆరా తీస్తుంటే, మరికొన్ని నేరుగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివిధ వర్గాల నుంచి విషయాన్ని రాబడుతున్నాయి.

సెల్ఫ్ సర్వేలు కూడా..

ఐదేళ్లలో తమ పనితీరు ఎలా ఉంది.. వచ్చే ఐదేళ్లు తమను కోరుకుంటున్నారా.. లేదా.. అనే విషయాలపైనా జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు సొంతంగా సర్వేలు చేయిస్తున్నారు. 'హలో.. మీ ఎమ్మెల్యేగారి పనితీరుపై మీరు సంతృప్తిగా ఉన్నారా.. ఉంటే ఒకటి నొక్కండి. పర్వాలేదు అనుకుంటే రెండు నొక్కండి.. ఇంకా బాగుండాలి అనుకుంటే మూడు నొక్కండి.. అస్సలు బాగాలేదు అనుకుంటే నాలుగు నొక్కండి..' అంటూ ఈ రకమైన కాల్స్ వస్తున్నాయి. వారి నుంచి వివరాలు సేకరించి ఎక్కడెక్కడి నుంచి, ఏయే వర్గాల నుంచి ఎలాంటి స్పందనలు వచ్చాయో తెలుసుకుంటున్నారు. అధికశాతం ఓటర్లు ఎలా స్పందించారనేది లెక్కలేస్తున్నారు. అందుకు తగ్గట్లు నియోజకవర్గాల్లో తమ ప్రచారం చేసుకునేలా ప్లాన్ చేసుకుంటున్నారు.

ఉపశమనమే..!



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు (ఫైల్)

- అసంతృప్తిలో అంగన్‌వాడీ టీచర్లు
- నూతన పాలసీపై మిశ్రమ స్పందన
- మినీసెంటర్ల అప్‌గ్రేడేషన్‌పై ఆనందం
- ఉద్యోగ విరమణ ప్యాకేజీపై పెదవివిరుపు
- పింఛన్.. సాయం పెంచాలని వినతి

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వివరాలు

ప్రాజెక్ట్	మెయిన్ కేంద్రం	మినీ కేంద్రం	హెల్పర్లు
భైంసా	175	18	157
ఖానాపూర్	194	37	183
ముధోల్	154	18	125
నిర్మల్	252	26	205

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీని ఆమోదించింది. ఇందులో ఉద్యోగ విరమణ, పెన్షన్ అంశాలు చేర్చారు. ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా వ్యవహరించే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇన్నాళ్లు రిటైర్మెంట్ తర్వాత నామమాత్రంగానే ఆర్థికసాయం అందేది. ఈ నేపథ్యంలో టీచర్లు, హెల్పర్లకు ఓ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించి నూతన పాలసీని తీసుకొచ్చింది. ఇందులో ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏళ్లుగా నిర్ణయించి, టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించింది. అలాగే ఆసరా పెన్షన్ అమలు చేయనున్నట్లు పేర్కొంది. అయితే ఇందులో ఆర్థికసాయం విషయంపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడేషన్..

ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో ఓ టీచర్, హెల్పర్ పనిచేస్తుండగా, మినీ కేంద్రంలో ఒక్క టీచర్ మాత్రమే పనిచేస్తారు. ప్రధాన కేంద్రాల్లో పనిచేసే టీచర్ల వేతనాలతో పోలిస్తే మినీసెంటర్లలో వేతనాలు తక్కువగా ఉన్నాయి. జనాభా పెరుగుతుండడంతో మినీ కేంద్రాలకు వచ్చేవారి సంఖ్య పెరగడంతో అన్నింటినీ నూతన పాలసీలో ఒకే కేటగిరీలోకి మార్చారు. తద్వారా జిల్లాలోని 110 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ప్రధాన సెంటర్లుగా మారనున్నాయి. ఫలితంగా అదనంగా హెల్పర్ అందుబాటులోకి రావడంతోపాటు టీచర్ల వేతనం పెరుగుతుంది.

సాయం తక్కువే..

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకుల్లో నూతన పాలసీపై మిశ్రమ స్పందన వస్తోంది. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన సెంటర్లుగా మార్చడంపై టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, హెల్పర్లు మాత్రం నూతన పాలసీలో తమ వేతనం పెంపును ప్రస్తావించడం లేదని చెబుతున్నారు. ఉద్యోగ విరమణ వయస్సును నిర్ధారించడాన్ని స్వాగతిస్తూనే.. ఆర్థిక సాయం మాత్రం తక్కువగా ఉన్నందున మరింత పెంచాలని కోరుతున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ఆసరా పెన్షన్‌గా ప్రకటించడం సరికాదని, ఉద్యోగుల మాదిరి పింఛన్ ఇస్తేనే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.

నగదు సాయం పెంచాలి



అంగన్‌వాడీ కేంద్రంలో ఏళ్ల తరబడి హెల్పర్‌గా పనిచేస్తే 65 ఏళ్ల వయస్సులో రూ.50వేలు చేతిలో పెడతారా? వృద్ధులయ్యాకా ఎవరికైనా ఆసరా పెన్షన్ వస్తుంది. దీనికి తోడు మరికొంత పెన్షన్‌ను అదనంగా ఇచ్చి నగదు సాయం పెంచాలి.

– దేవిక, అంగన్‌వాడీ హెల్పర్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు

మరోసారి పరిశీలించాలి



ఉద్యోగ వయస్సు నిర్ణయించడం సరైనదే అయినా ప్యాకేజీ, పెన్షన్ విధానం మాత్రం అసంతృప్తిగా ఉన్నాయి. వృద్ధాప్యంలో రూ.లక్ష ఏమాత్రం సరిపోదు. పెన్షన్‌ను ఆసరాకు ముడిపెట్టడం సరికాదు. ఈ విషయమై మరోసారి పరిశీలించాలి. అంగన్‌వాడీ టీచర్లకు న్యాయం చేయాలి.

– రాజమణి, అంగన్‌వాడీ టీచర్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

నిరుపేదలకు ప్రభుత్వ భరోసా

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

సారంగాపూర్: నిరుపేదలకు క్రమబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం భరోసా ఇచ్చిందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఊరగుట్టపై కొన్నేళ్లుగా నివాసముంటున్న అర్హులైన నిరుపేదలకు జీవో 58, 59 ప్రకారం క్రమబద్ధీకరణ చేసి శనివారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల ఇబ్బందులు దూరం చేయడమే బీఆర్‌ఎస్ లక్ష్యమని పేర్కొన్నారు. ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్రామిరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, అయిర నారాయణరెడ్డి, పోతిరెడ్డి సుజాత, దత్తూరాం, రాజ్‌మహ్మద్, ఆర్డీవో రత్నమాల, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో సరోజ తదితరులున్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

నిర్మల్‌చైన్‌గేట్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర మంత్రి అలోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎకనామికల్ సపోర్ట్ స్కీం కింద శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి ఆయన 100 మంది మైనార్టీ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.లక్ష గ్రాంట్ ద్వారా మైనార్టీలు స్వయం ఉపాధి పొంది అభివృద్ధి సాధించాలని సూచించారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

పట్టాల పంపిణీ..

జీవో 58 ద్వారా అర్హులైన లబ్ధిదారులకు కలెక్టరేట్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టాలు పంపిణీ చేశారు. సారంగాపూర్ మండలానికి చెందిన 47మందికి, నిర్మల్‌కు చెందిన 12మందికి పట్టాలు అందించారు.

'ఎఫ్‌టీఎల్'పై నివేదికకు హైకోర్టు ఆదేశం

- కలెక్టరేట్ రోడ్డు నిర్మించడంపై పిల్
- విచారణకు జిల్లా జడ్జికి ఆదేశాలు

నిర్మల్: జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో గల కొచ్చెరువు (కొత్తచెరువు) ఎఫ్‌టీఎల్ (ఫుల్‌ట్యాంక్ లెవల్) ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలంటూ జిల్లా జడ్జికి హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. కొచ్చెరువు ఎఫ్‌టీఎల్‌లో కలెక్టరేట్ కొత్తరోడ్డు నిర్మాణం చేపట్టారంటూ జిల్లాకేంద్రానికి చెందిన న్యాయవాది, బీజేపీ నేత కే అంజుకుమార్‌రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) వేశారు. గతంలో ఎఫ్‌టీఎల్‌లో ఎలాంటి రోడ్డు నిర్మాణాలు చేపట్టవద్దని, యథాస్థితి ఉత్తర్వులు కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చినా ధిక్కరించారంటూ అందులో పేర్కొన్నారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టీ వినోద్‌కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నరేశ్‌రెడ్డి వాదించారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయాలని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలనూ అమలు చేయలేదని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. మరోవైపు ప్రభుత్వ న్యాయవాది అనంత నాగేశ్వరరావు వాదనలు వినిపించారు. చెరువుకు మూడు వైపులా ఫెన్సింగ్ నిర్మించామని, ఒకవైపు రోడ్డు ఉండగా వేయలేదని చెప్పారు. ఈ రోడ్డు కూడా 60 ఏళ్లుగా ఉందని, 25వేల మందికి ఉపయోగకరంగా ఉందని వాదించారు. ఈమేరకు ధర్మాసనం స్పందిస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎఫ్‌టీఎల్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదని పేర్కొంది. వాస్తవ పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ జిల్లా జడ్జికి ఆదేశాలు జారీ చేసింది. విచారణను అక్టోబర్ 3తేదీకి వాయిదా వేసింది.

'ఓటరు నమోదుకు చర్యలు చేపట్టాలి'

నిర్మల్‌చైన్‌గేట్: రెండో ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి, 18 ఏళ్లు నిండినవారంతా ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రెండో ఓటరు జాబితా సవరణలో భాగంగా గత నెల 21నుంచి ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహించనున్న నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా మార్పులు, సవరణలు, తొలగింపుల కోసం ఫారం 6, 7 ,8 ద్వారా వచ్చిన దరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్డీవోలు కోమల్‌రెడ్డి, జీవాకర్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ఉద్యమకారుల దీక్ష

నిర్మల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాకేంద్రంలో ఆదివారం శాంతియుత దీక్ష నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా చైర్మన్ కొట్టె శేఖర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కమ్ రామకృష్ణగౌడ్, నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షుడు సామ కిరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాధన కోసం 1969 నుంచి 2014వరకు ఉద్యమంలో ముందుండి ఎంతోమంది లాఠీదెబ్బలు తిన్నారని తెలిపారు. జైలు జీవితాన్నీ అనుభవించారని పేర్కొన్నారు. ఇలాంటి వారిని గుర్తించి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, అన్ని రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోలో దీనిపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అమరవీరుల కుటుంబాలను గుర్తించి రూ.10లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాల్లో అమరులు, ఉద్యమకారులకు కోటా కేటాయించాలని కోరారు. ఈమేరకు తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ఆదివారం 33 జిల్లాల్లో శాంతియుత దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబసభ్యులు, అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విజయవంతం చేయాలి

భైంసాటౌన్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లాకేంద్రంలో చేపట్టనున్న శాంతియుత దీక్ష విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అ ధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ ఓ ప్రకటనలో కోరారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబసభ్యులు, అన్నివర్గాలవారు పాల్గొనాలని సూచించారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

లోకేశ్వరం: త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంతో పంటలు ఎండుతున్నాయని శనివారం అబ్దుల్లాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట ఆ గ్రామ రైతులు ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వారం రోజులుగా ఆరు గంటలకు మించి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కావడంలేదని తెలిపారు. దీంతో పొట్ట దశలో ఉన్న వరి పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. సమస్య తెలిపేందుకు ఏఈకి ఫోన్ చేస్తే స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఏఈ శివకుమార్‌ను వివరణ కోరగా.. శుక్రవారం ఒక్కరోజు మాత్రమే విద్యుత్ అంతరాయం ఏర్పడిందని తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని, నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసి పంటలు ఎండకుండా చూస్తామని హామీ ఇచ్చారు.



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

క్రమబద్ధీకరించాలని దీక్ష

నిర్మల్‌చైన్‌గేట్: 104 వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఏజెన్సీ విధానం రద్దు చేసి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏఎస్‌ఎంలను రెండో ఏఎన్‌ఎంలుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. ఉద్యోగులకు వారి ఆప్షన్ ప్రకారం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, హెల్త్ కార్డు లేదా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. 35 క్యాజువల్ లీవులు, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్నిరకాల సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శిబిరంలో నాయకులు వెంకటస్వామి, రాజేందర్, శ్రీనివాస్, ఆనంద్, ప్రత్యూష, రాజేందర్, మీరాకుమారి, శామ్యూల్ పాల్గొన్నారు.



నిరసన దీక్షలో 104 ఉద్యోగులు

గవర్నర్‌కు బీజేపీ నాయకుల ఫిర్యాదు

- బీఆర్‌ఎస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న పోలీసులపై చర్య తీసుకోవాలని వినతి

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్‌ఎస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న పోలీసులను తక్షణమే సస్పెండ్ చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్మల్ బీజేపీ నాయకులు, రైతులు శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జిల్లా కేంద్రంలో లాఠీచార్జిలో గాయపడ్డ రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి గవర్నర్‌తో మాట్లాడుతూ.. నిర్మల్ మాస్టర్‌ప్లాన్ రద్దు కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు నిర్మల్ బస్టాండ్ ఎదురుగా రోడ్డుపై బైఠాయించి శాంతియుత నిరసన తెలిపేందుకు వెళ్లారని తెలిపారు. ఈక్రమంలో పోలీసులు అత్యుత్సాహంతో అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ విచక్షణారహితంగా కార్యకర్తలు, రైతులపై లాఠీచార్జి చేయడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. నిర్మల్ పట్టణ సీఐతోపాటు పలువురు పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గవర్నర్ సానుకూలంగా స్పందించారని ఏలేటి తెలిపారు. సంబంధిత అధికారులందరికీ నోటీసులు పంపించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, అంజుకుమార్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, వొడిసెల అర్జున్, సాథం అరవింద్, సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మ రాజు, గాదె విలాస్, అల్లం భాస్కర్, హరీశ్‌రెడ్డి, సరికెల గంగన్న, భూపాల్‌రెడ్డి, భూపతిరెడ్డి, మారగంగారెడ్డి, నారాయణరెడ్డి తదితరులున్నారు.



గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

క్లుప్తంగా

సాంగ్విలో నెమలి


నెమలిని చూపిస్తున్న స్థానికులు

జైనథ్: మండలంలోని సాంగ్వి గ్రామంలో శనివారం స్థానికులకు నెమలి లభించింది. గ్రామ శివారులు కొంత మంది నెమలిని గమనించడంతో, సర్పంచ్ విఠల్ రెడ్డికి సమాచారం అందించారు. కాగా కొంత అస్వస్థతతో ఉన్న నెమలిని ఆయన స్థానికుల సాయంతో జాగ్రత్తగా పట్టుకొని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య


మహేందర్ మృతదేహం

ఖానాపూర్: మండలంలోని చందునాయక్ తండాకు చెందిన లావుడ్య మహేందర్(34) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మృతి చెందిన రైతు తమకున్న రెండెకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు సైతం కౌలుకు తీసుకుని పత్తి పంటను వేశాడు. ఈ ఏడు కురిసిన అధిక వర్షాలతో ఎకరం పత్తి పంట పూర్తిగా నీటమునిగిపోయింది. దీంతో పంటల సాగుకు చేసిన రూ.4లక్షల అప్పు ఎలా తీర్చాలని, జీవితంపై విరక్తితో పంట చేనులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గమనించిన మహేందర్ సోదరుడి కుమారుడు భీముడు వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. చికిత్సపొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కే సు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


ముత్యం (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన బెడ్డ ముత్యం(42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన ముత్యం తన భార్య గంగామణి నాలుగేళ్లకిందట అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆగస్టు 28 సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆగస్టు 30న తల్లి భోజవ్వ లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శనివారం ముథోల్ మండలంలోని వాడ్తల్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఉరేసుకుని కనిపించాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితికి చేరుకుంది. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. శనివారం తల్లి భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

మావలలో రోడ్డు ప్రమాదం

ఆదిలాబాద్‌రూరల్: మావలలో శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... తలమడుగు మండలం ఝరిపూనగూడకు చెందిన టేకం భరత్, మేస్రం హన్మంతు శనివారం పని నిమిత్తం ఆదిలాబాద్ వచ్చి పనులు ముగించుకుని తిరిగి గ్రామానికి వెళ్తున్న క్రమంలో మావల వద్ద ఆగి ఉన్న కారును ఢీకొట్టాడు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఇరువురిని చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కి తరలించారు. ఇందులో హన్మంతు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఉత్తమ సేవలకు గుర్తింపు

ఉపాధ్యాయుల శ్రమకు తగిన ఫలితం దక్కింది. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో వారి కృషిని ప్రభుత్వం గుర్తించింది. చదువుతో పాటు విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా సీట్లు సాధించేలా చేయడంలో ఒకరు.. తోటి ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలు నేర్పడంలో మరొకరు... సైన్స్‌పై మక్కువ పెంచేలా బోధన చేస్తున్న మరొకరు ఇలా రాణిస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగుర్ని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. వారికి ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులను సైతం అందించనుంది.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా రమేశ్

- ఈ నెల 5న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు


రమేశ్

జన్నారం: ఉపాధ్యాయ వృత్తిని ఫ్యాషన్‌గా భావించి, విద్యార్థులను బావిపౌరులుగా తయారు చేయడానికి తనవంతు కృషిలో ఉత్తమ సేవలందించినందుకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. పదో తరగతి విద్యార్థులను ప్రేరణ చేయడంలో, ఉత్తమ ఫలితాల సాధనలో, జాతీయ ఉపకార వేతనాలు పొందడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన జన్నారం మండలం కలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు (సైన్స్) మురిమడుగుల రమేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా అర్హత సాధించాడు.

పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

రెండేళ్లుగా పదో తరగతి విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి చదువుపై దృష్టి సారించారు. ఉదయం 4గంటలకు లేచి చదువుకునేలా ప్రతీ రోజు మానిటరింగ్ చేయడం, ప్రధానోపాధ్యాయుడు జాడి ప్రభాకర్ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం చదువుకునే ఫొటో, చదివిన సబ్జెక్టు వివరాలను గ్రూపులో అప్‌లోడ్ చేసే విధంగా మానిటరింగ్ చేశారు. అదే విధంగా జాతీయ ఉపకార వేతనాలు పొందడంలో జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించేలా చేయడం, 2019 లో జిల్లా రెండో స్థానం, 2022లో జిల్లా నాలుగోస్థానంలో నిలిచారు. జాతీయ ఉపకార వేతనాలు పొందే ఎంపిక పరీక్ష కోచింగ్ రమేశ్ ఇచ్చేవారు. దీంతో పాటు పదో తరగతి చదివే విద్యార్థులు పోటీ పరీక్షలు, మేధో లాంటి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే కార్పొరేట్ కళాశాలల్లో సీట్లు సాధించడానికి ఆయన కోచింగ్ ఇవ్వడమే కాకుండా రాయడానికి తీసుకెళ్లి, అర్హత పొందేలా కృషి చేశారు. రెండు సంవత్సరాలుగా పలువురు విద్యార్థులు మేధా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా చదివేందుకు అర్హత సాధించారు. అలాగే పాఠశాల పచ్చదనంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నాడు. రమేశ్‌ను గ్రామ సర్పంచ్ కార్తీక్‌రావు, జిల్లా విద్యాధికారి యాదయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, మండల విద్యాధికారి విజయ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్ అభినందించారు.


విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న ఉపాధ్యాయుడు

సైన్స్‌పై ఆసక్తి కల్పిస్తున్న... నారాయణవర్మ


నారాయణవర్మ

మామడ: పాఠ్యాంశాలను కృత్యాలతో బోధిస్తూ కఠినమైన భౌతిక అంశాలను సైతం విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించి సైన్స్ పట్ల ఆసక్తిని కల్పిస్తున్నారు. ఉపాధ్యాయులకు బోధన వ్యూహాలపై అవగాహన కల్పించి విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధించాల్సిన అంశాల్లో శిక్షణ కేంద్రాల్లో అవగాహన కల్పించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యాడు. అతడే మామడ మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు పాలకొండ నారాయణవర్మ. 2002 డీఎస్సీలో ఎస్‌జీటిగా ఎంపికై పదోన్నతిపై భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. 2001లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నాడు. జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్ సబ్జెక్ట్‌కు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఓపెన్‌స్కూల్ విభాగంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో పాఠ్యాంశాలను అందించారు. వర్మ ఎడ్యుకేషన్ పోర్టల్ యూట్యూబ్‌ను రూపొందించి భౌతికరసాయన పాఠ్యాంశాలను వ్యూహాల విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.


విద్యార్థులకు యోగా పాఠాలు బోధిస్తున్న గంగా శంకర్

నీరడీ గంగా శంకర్

బోధనకు మెచ్చి..

- ఉత్తమ ఉపాధ్యాయులుగా సిద్ధ పద్మ, గంగా శంకర్

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న సిద్ధ పద్మ, సోఫీ నగర్ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నీరడీ గంగా శంకర్‌ల సేవలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికచేసింది. విద్యార్థులకు తాను చేసిన సేవకు దక్కిన ఫలితమే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అని సిద్ధ పద్మ పేర్కొన్నారు. 2000, నవంబర్‌లో డీఎస్సీ ద్వారా బయో సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా తానూర్ మండలంలోని ఎల్వి ఉన్నత పాఠశాలలో మొదటి ఉద్యోగం సాధించగా ఆ తర్వాత 2005లో ఖానాపూర్ బాలికల పాఠశాలలో పీజీహెచ్‌ఎంగా ప్రమోషన్ పొందింది. 2009లో నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లీ ఉన్నత పాఠశాలకు బదిలీ కాగా 2013 నుంచి 2015 వరకు నిర్మల్ ఎంఈవోగా బాధ్యతలు నిర్వహించారు. 2017 నుంచి 2020 వరకు డీఈవో కార్యాలయంలో సమగ్ర సర్వ శిక్ష అభియాన్ జిల్లా అధికారిగా పనిచేశారు. ఆ తర్వాత 2000 నుంచి 2023 వరకు ప్రస్తుతం పనిచేస్తున్న మంజులాపూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. 2021లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

అత్యుత్తమ బోధనకు

జిల్లా కేంద్రంలోని సోఫినగర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నీరడీ గంగా శంకర్ అత్యుత్తమ బోధనకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డును అందించనుంది. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రానికి చెందిన గంగా శంకర్ 1992లో నిజామాబాద్ ఎడపల్లి ఉన్నత పాఠశాలలో ఎస్జీటీగా విధులు ప్రారంభించారు. ఆ తర్వాత 1996లో పోచంపాడు బాలికల కళాశాలలో పీజీటీగా... తర్వాత 2006లో బోధన్ బాలికల పాఠశాలలో పనిచేశారు. 2016లో పోచంపాడు బాలుర కళాశాలకు బదిలీ అయ్యారు. 2018 నుంచి సోఫీనగర్ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2019లో జిల్లా ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు లభించింది. 2023 దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉత్తమ ప్రిన్సిపల్‌గా అవార్డు అందుకున్నారు. తల్లి గృహిణి కాగా.. తండ్రి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడుగా ఉన్నారు.


మంజులాపూర్‌లో ఉపాధి హామీ పనుల వద్ద బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న పద్మ(ఫైల్)

సిద్ధ పద్మ

ముత్నూర్‌లో కేంద్ర బృందం పర్యటన


గ్రామంలో కేంద్ర బృందం ప్రతినిధులు

ఇంద్రవెల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 అవార్డు ఎంపికలో భాగంగా శనివారం మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని జిల్లా అధికారులతో కలిసి కేంద్ర బృందం ప్రతినిధులు వెంకటేష్, కిషోర్, సునీల్‌లు సందర్శించారు. ముత్నూర్ గ్రామంలో ఇంటింటిని సందర్శించి నిర్మించిన ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, స్వచ్ఛతను పరిశీలించడంతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించారు. అదే విధంగా చెత్త డంపింగ్ యార్డు, కంపోస్టుషెడ్లు, ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ సీవో గణపతి, డీఆర్‌డీవో కిషన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీవో రవీందర్, డీఎల్పీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్, ఏపీవో శ్రీనివాస్ ఉన్నారు.

బాలుని కిడ్నాప్‌కు యత్నం


కిడ్నాప్ చేసిన వ్యక్తి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో ఏడేళ్ల బాలుడి కిడ్నాప్ యత్నం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్స్ తన ఇద్దరు కుమారులతో శని వారం విధులకు హాజరైంది. సాయంత్రం సమయంలో ఓ వ్యక్తి సదరు వైద్య ఉద్యోగి ఏడు సంవత్సరాల బాలుడికి మాయ మాటలు చెప్పి తీసుకువెళ్లాడు. బాలుడు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లి బాలుడిని వెతుక్కుంటూ వెళ్లగా ఎన్టీఆర్ మినీ స్టేడియం ముందు గుర్తు తెలియని వ్యక్తి తన బాలుడి పట్టుకొని వెళ్లడం గుర్తించి నిలదీసింది. స్థానికుల సహాయంతో కిడ్నాప్ చేసిన వ్యక్తిని జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్‌కు చెందిన శీనుపై దాడి చేసిన పిట్టల్‌వాడకు చెందిన దీప్లే మోహన్‌పై శనివారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాంనగర్‌కు చెందిన శీను ఆయన భార్యతో కలిసి పిట్టల్‌వాడలోని మోహన్ ఇంటి వద్ద కూలీ పనులు చేశాడు. కూలీ డబ్బులు ఆడిగిన్నందుకు మోహన్ ఇటుకతో దాడి చేశాడు. దీంతో శీనుకు గాయమైంది. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు మోహన్‌పై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు.

వర్గీకరిస్తే మద్దతు.. లేకపోతే పతనం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడాల స్వామి మాదిగ

నేరడిగొండ: త్వరలో నిర్వహించే పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి వర్గీకరిస్తే మద్దతు తెలుపుతామని, లేకపోతే కేంద్ర ప్రభుత్వానికి పతనం తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడాల స్వామి మాదిగ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతున్న వర్గీకరణ పోరాటానికి విముక్తి లభించేలా చేసి బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలుబెట్టుకోవాలన్నారు. భవిష్యత్‌లో రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాలంటే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జరపాలని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి నేటికి తొమ్మిదిన్నర సంవత్సరాలు గడుస్తున్నా పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా నాన్చుడు ధోరణి అవలంభించకుండా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. ఈనెల 18 నుంచి 22 వరకు జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి బీజేపీ ప్రభుత్వ చిత్తుశుద్ధిని నిలబెట్టుకోవాలని కోరారు. లేకుంటు గుణపాఠం తప్పదన్నారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో వర్గీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఈ ఐదు రోజుల పాటు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేలా చేయాలని అన్నారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ అదే పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టి చిత్తశుద్ధిని చాటుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గజ్జల శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కారెం రవి మాదిగ, అశోక్ మాదిగ, సాకలి అడెల్లు, రమణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కుడాల స్వామి మాదిగ

అనారోగ్యంతో రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ మృతి


నారాయణ్ సింగ్ (ఫైల్)


నివాళి అర్పిస్తున్న కమాండెంట్

నేరడిగొండ: టీఎస్ఎస్పీ బెటాలియన్ రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ కటక్వాల్ నారాయణ్ సింగ్ (59) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. ఇటీవల ఆయన ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో ఆయన కుటుంబీకులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం ఇంటికి తీసుకురాగా మృతిచెందాడు. శనివారం మండల కేంద్రంలో టీఎస్ఎస్పీ బెటాలియన్ ఆధ్వర్యంలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. కమాండెంట్‌లు ఆయన పార్థివ దేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవిందర్‌రెడ్డి పరామర్శించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


సంఘటన స్థలంలో క్షతగాత్రులు


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆసీఫ్



నేరడిగొండ: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన ఘటన శనివారం వడూర్ వెళ్లే రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన ఆడెపు బాబు ఆయన మామతో కలిసి బైక్‌పై నేరడిగొండకు వస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ పింటు వడూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వడూర్ రోడ్డుపై రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆ ముగ్గురికి సైతం గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వడూర్ రోడ్డు బురదమయంగా మారడంతోనే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలోఇరువురికి గాయాలు

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన యువకులు ఇద్దరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. బాధితులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఆసీఫ్, ఖాజా అనే ఇద్దరు యువకులు పని నిమిత్తం ఆదిలాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ దాబా వద్ద రోడ్డు పనులు నిర్వహిస్తున్న రోడ్ రోలర్‌ను అనుకోకుండా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వెంటనే అంబులెన్సులో రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. కాగా ప్రమాదం జరిగినప్పటికీ వారు సురక్షితంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారని ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

గురుకుల డిగ్రీ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం పొందాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌సీఓ గోపీచంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మహిళా డిగ్రీ కళాశాలలు, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో బాలుర డిగ్రీ కళాశాలలు మంజూరయ్యాయని అన్నారు. బీఏ(ఈపీహెచ్), బీకాం(సీఏ), బీఎస్సీ(ఎంపీసీఎస్), బీఎస్సీ(బీజడ్సీ) కోర్సులలో నేరుగా ప్రవేశం కలిపిస్తున్నామని, అర్హులైన విద్యార్థులు వెంటనే దోస్త్ రిజిస్ట్రేషన్‌తో సంబంధిత కళాశాలల్లో సంప్రదించాలని తెలియజేశారు. పూర్తి వివరాలకు జిల్లా కన్వీనర్‌లను సంప్రదించాలని సూచించారు. బాలుర డిగ్రీ కళాశాలల కోసం సేరు శ్రీధర్–79934 56620 (మంచిర్యాల), హుస్సేన్–83175 49426 (నిర్మల్)లను సంప్రదించాలని తెలిపారు. ఇక మహిళల డిగ్రీ కళాశాలల కోసం శ్రీవిద్య– 97057 36201 (ఆదిలాబాద్), సృజనాదేవి– 94913 22883 (ఆసిఫాబాద్)లను అడ్మిషన్ల కోసం సంప్రదించవచ్చని, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

- స్కూటీపై వెళ్తుండగా ముఖానికి అడ్డువచ్చిన చున్ని
- తొలగించే క్రమంలో ప్రమాదం


కుటుంబంతో మంజుల (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్/మందమర్రిరూరల్: ప్రమాదవశాత్తు స్కూటీపై నుంచి పడి మహిళ టీచర్ మృతిచెందగా మరో టీచర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మందమర్రికి చెందిన మంజుల (34), మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన చెందిన నిర్మల వాంకిడి మండలంలో వేర్వేరు ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. మంజుల నార్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా, నిర్మల వాంకిడి ఉన్నత పాఠశాలలో ఎస్ఏగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చారు. నిత్యం బస్సులో ఆసిఫాబాద్‌కు వచ్చి అక్కడి నుంచి స్కూటీపై వాంకిడికి వెళ్తుంటారు. శనివారం కూడా ఆసిఫాబాద్‌కు వచ్చి స్కూటీపై వాంకిడికి వెళ్తున్న క్రమంలో ఇప్పల్ నవెగాం వద్ద ఎదురుగా లారీ వస్తుండగా గాలికి మంజుల ముఖానికి చున్ని అడ్డు రాగా చేతితో తొలగించే క్రమంలో స్కూటీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు కిందపడ్డారు. అటువైపు నుంచి వస్తున్న మరో ఉపాధ్యాయుడు గమనించి 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మంజుల మృతిచెందింది.

మందమర్రిలో విషాదం...

మందమర్రి పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన నామని సురేష్ గతంలో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న క్రమంలో సంగారెడ్డికి చెందిన మంజులతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. 2017లో ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. వీరికి అరుషీ(7), దక్ష(3) కూతుర్లు ఉన్నారు. మంజుల హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా.. సురేష్ తండ్రి సింగరేణిలో ఉద్యోగం చేసి మెడికల్ అన్‌ఫిట్ కావడంతో అతడికి ఉద్యోగం రాగా కాసిపేట గనిలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఏడాదిన్నర క్రితం మంజులకు కుమురం భీం జిల్లాకు బదిలీపై వచ్చింది. మంజుల అంత్యక్రియలను చిన్నకూతురుతో చేయిస్తుండడం స్థానికులను కలిచివేసింది.

అంతర్ జిల్లా మోసగాళ్లు అరెస్ట్

- ప్రైవేట్ సొసైటీ పేరుతో మోసాలు
- ఐదు బ్రాంచ్‌లలో 1,600 మంది దగ్గర రూ.3 కోట్ల వసూలు
- రియల్‌ఎస్టేట్, లిక్కర్, చిట్‌ఫండ్స్‌లలో పెట్టుబడులు
- రాజన్నసిరిసిల్ల, మంచిర్యాల జిల్లాల్లో ఐదు కేసులు
- ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: ప్రైవేట్ కంపెనీని ఏర్పాటు చేసి ప్రజల నుంచి భారీ ఎత్తున వసూలు చేసి మోసానికి పాల్పడ్డ ఇద్దరిని రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మంచిర్యాల జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కర్ల శ్రీధర్, జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని చెగ్యాం గ్రామానికి చెందిన పోతరాజు లక్ష్మణ్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కర్ల శ్రీధర్ 2000 సంవత్సరంలో మంచిర్యాల జిల్లాలో ఉజ్వల థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ, మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటీవ్ సొసైటీ కంపెనీని స్థాపించారు. ఆరు నెలల వ్యవధిలోనే బెల్లంపల్లి, లక్సెట్టిపేట, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో సొసైటీలు స్థాపించారు. దాదాపు 1,600 మంది వరకు ఖాతాలు తెరవడంతో రూ.3 కోట్ల వరకు సేకరించారు. శ్రీధర్ చైర్మన్‌గా, తన పూర్వ విద్యార్థి పోతరాజుల లక్ష్మణ్‌ను సీఈవోగా నియమించుకొని మరికొంత మంది సిబ్బందిని తీసుకున్నారు. ప్రజల నుంచి రికరింగ్ డిపాజిట్స్ ద్వారా డబ్బులు వసూలు చేశారు. ఆ డబ్బులను శ్రీధర్, లక్ష్మణ్ కలిసి మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో రియల్ ఎస్టేట్, లిక్కర్, చిట్‌ఫండ్స్‌లలో పెట్టుబడి పెట్టారు. వివిధ స్కీమ్‌ల ద్వారా 150 మందికిపైగా సభ్యత్వం కల్పించి, సొసైటీలో ఖాతా తెరిచేందుకు రూ.650 వసూలు చేశారు. తమ సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే తక్కువ కాలంలోనే రెట్టింపు అవుతుందని నమ్మించారు. గత నెల 22న వేములవాడకు చెందిన బుస్స శ్రీనివాస్ మరికొందరు బాధితులు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈనెల 1న వ్యాపారం కోసం శ్రీధర్, లక్ష్మణ్‌లు కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా వేములవాడటౌన్ పోలీసులు నందికమాన్ వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కారు, సొసైటీకి సంబంధించిన కరపత్రాలు, పాస్‌బుక్స్, అకౌంట్ ఓపెనింగ్, క్లోజింగ్ ఫామ్స్, లావాదేవీలకు సంబంధించిన రిజిస్టర్స్, మూడు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రైవేట్ కంపెనీలు, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడవద్దని, ఏదైన సమస్యలు ఉంటే నేరుగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్, పోలీసులు పాల్గొన్నారు.


నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, సీఐ కరుణాకర్